మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

తడిసిన మక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి
- మాజీ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య

జడ్చర్ల,మే 17, ప్రభాతవార్త : మార్కెట్ యార్డ్ లో తడిసిన మొక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జడ్చర్ల కల్వకుర్తి ప్రధాన రహదారిలో పత్తి మార్కెట్ దగ్గర మక్కల కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన మక్కలను వారు పరిశీలించారు. మక్కలు శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో మక్కలు నానిపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారని,ప్రభుత్వ నిరక్ష్యం వల్లే నేడు ఈ పరిస్థితి ఎదురైందని విమర్శించారు.ప్రభుత్వం నిరక్ష్యం వలన కొనుగోలు చేసిన మక్కలు సకాలంలో గోదాంలకు తరలించక పోవడం వలన మక్కలు, వడ్లు తడిసిపోయాయని తెలిపారు.తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఏవో గోపినాథ్‌ను కలిసి రైతుల పరిస్థితిని వివరించారు. ఇంతియాజ్ ఖాన్, శంకర్ నాయక్, శ్రీకాంత్, శ్రీధర్ రెడ్డి, కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, రఘునందన్ రెడ్డి, జయపాల్, తబ్ రేస్, రాఘవేందర్ గౌడ్‌లు ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మేయర్ మమత, కార్పొరేటర్ రాధా

గృహిణి నుంచి మేయర్ అయ్యా..

ఉన్నత లక్ష్యంతో అడుగులు వేయాలి

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన మేయర్ గుమ్మాల్ మమత ప్రసంగం

ఎన్‌విఎస్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు

మహబూబ్‌నగర్, మే 17, ప్రభాతవార్త : ఒక సామాన్య గృహిణిగా, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తాను నేడు మేయర్‌గా బాధ్యతలు చేపట్టడం వెనుక ఉన్న కృషిని వివరిస్తూ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ విద్యార్థులకు స్ఫూర్తిని నింపారు. మహబూబ్‌నగర్ లోని ఎన్‌విఎస్ ప్రభుత్వ డిగ్రీ,సైన్స్ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక,విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి, వారికి సీఎస్సార్ నిధుల ద్వారా ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ మున్సిపల్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ విచ్చేసి విద్యార్థులను అభినందించారు. అలాగే స్థానిక 24వవార్డు కార్పొరేటర్ బి.రాధా గోవర్ధన్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యకు ఇస్తున్న ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల అభివృద్ధికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యేతో చర్చించి త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తమ లక్ష్యాల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. క్రీడలు, ఇతర పోటీల్లో విద్యార్థులు కనబరిచిన ఉత్సాహం, గెలుపు సాధించాలనే పట్టుదల అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా భావించి తీర్చిదిద్దిన కళాశాల అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొ॥ కె. సత్య భాస్కర్ రెడ్డి, డా. ఎస్.సురేష్, డా. సత్యనారాయణ గౌడ్, డా. బక్షి రవీందర్‌రావు, డా. సుభాషిణి, డా. రాఘవేంద్రరావు, డా. జే.నరసింహులు, ఎస్.శివప్రసాద్, డా. సాంబశివరావు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

అరుదైన కీటకాహార మొక్క కనువిందు

తెలంగాణ బొటానికల్ గార్డెన్లో అరుదైన మొక్క

జడ్చర్ల,మే17,ప్రభాతవార్త : సాధారణంగా కీటకాలు మొక్కల మీద దాడి చేసి వాటిని నాశనం చేస్తాయి. కానీ దానికి విరుద్ధంగా ఈ మొక్కల దగ్గరికి కీటకాలు వస్తే వాటిని చక్కగా ఆరగించేస్తాయి. అలాంటి అరుదైన కీటకాహార మొక్కను ఇప్పుడు డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీకళాశాల జడ్చర్లలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్లో చూడవచ్చని తెలంగాణ బొటానికల్ గార్డెన్ కు బహుమతిగా ఇచ్చారని గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య తెలిపారు. నెపంథిస్ అనే ప్రజాతికి సంబంధించిన ఈ మొక్కల యొక్క పత్రాలలోని నడిమి ఈనె ప్రత్యేక రూపాంతరం చెంది కూజా ఆకారంలో మారుతుంది. దీనికి ఒక మూత కూడా ఉంటుంది.ఈమూత ఆకర్షణీయంగా ఉండి కీటకాలను ఆకర్షిస్తుంది. ఆకర్షింపబడిన కీటకాలు కూజా యొక్క మొదటి భాగాన ఉన్న జిగురు వల్ల కూజాలోకి జారిపోతాయి. దీనిలో జీర్ణం చేసే ఎంజైములు ఉండటం వల్ల అందులో పడిన కీటకాలను పూర్తిగా జీర్ణం చేసుకొని ఈ మొక్కలు కావలసిన పోషకాలను పొందుతాయి. సహజ సిద్ధంగా ఇవి నాగాలాండ్‌లోని కాశీ హిల్స్‌లో పెరుగుతాయి.వీటిని ఇటీవల కాలంలో హైబ్రిడ్లుగా మార్చి అనేక ప్రదేశాలలో పెంచుతున్నారు. ఈ మొక్కలు అత్యంత సునిశితంగా ఉంటూ చల్లని తేమతో కూడిన ప్రదేశాలలో మాత్రమే పెరుగుతుంటాయి. వీటి గురించి పాఠశాల, ఇంటర్మీడియట్ పుస్తకాలలో ప్రస్తావించబడినది. ఇటువంటి మొక్కలను మన తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో సంరక్షించడం వల్ల విద్యార్థులు ఈ గార్డెన్ సందర్శించినప్పుడు ఈ మొక్కలను ప్రత్యక్షంగా చూసి జ్ఞానం పొందే అవకాశం ఉంది. వరంగల్‌కు చెందిన ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రెసిడెంట్ ఇందారం నాగేశ్వర్ ఈమొక్కలను కర్ణాటకలోని కూర్గ్‌ప్రాంతంలో ఉన్న నర్సరీ నుంచి సేకరించి తెలంగాణ బొటానికల్ గార్డెన్‌కు బహుమతిగా ఇచ్చారని గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య తెలిపారు. ఇలాంటి అరుదైన మొక్కలనెన్నో తెలంగాణ బొటానికల్ గార్డెన్లో సంరక్షించాల్సిన అవసరం ఉందని, తద్వారా విద్యార్థులు విషయపరిజ్ఞానం ప్రత్యక్షంగా పొందగలరని సదాశివయ్య తెలిపారు. ఈ మొక్కను బహుకరించిన నాగేశ్వర్ ను సదాశివయ్య అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

- క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యటనలు
- 45 వేల గన్నీ సంచుల పంపిణీ
- అదనపు లారీలు, ట్రాక్టర్ల ఏర్పాటు
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ

తూకాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు రవి నాయక్, గంప శ్రీనివాస్

మహబూబ్‌నగర్, మే 17 ప్రభాతవార్త : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.జిల్లాకలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్నిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కావలసిన అన్ని చర్యలను తీసుకుంటున్నారు. అకాల వర్షాల దృష్ట్యా పిపిసి కేంద్రాలలో నింపి ఉన్న ధాన్యం బస్తాల రవాణాకు కావలసిన లారీలను,ట్రాక్టర్లను ఏర్పాటుచేసి ధాన్యం రవాణాను వేగవంతం చేశారు.అలాగే అధిక సంఖ్యలో గన్నీ సంచుల సరఫరా, హమాలీల నియామకం, రైతులకు మౌలిక వసతుల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా 45 వేల గన్నీ సంచులను సరఫరా చేయడంతో పాటు అదనపు లారీలు,ట్రాక్టర్లను ఏర్పాటుచేసి ధాన్యం తరలింపును వేగవంతం చేశారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ ఆదివారం జడ్చర్ల కాటన్ మార్కెట్ యార్డును సందర్శించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటుచేయాలని, గన్నీ సంచులు సమృద్ధిగా నిల్వఉంచాలని సూచించారు.అలాగే కొనుగోలు చేసిన మొక్కజొన్నను వెంటనే సమీప గోదాములకు తరలించేలా లారీలు, ట్రాక్టర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.అకాల వర్షాలవల్ల ధాన్యం దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు తాగునీరు, నీడ, ఇతర మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు అనంతరం వెంటనే రసీదులు అందజేసి ఓపిఎంఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ డియం రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్‌తో కలిసి అడ్డాకుల మండలంలోని బాలీద్‌పల్లి, కన్మనూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను వెంటనే ట్రాక్టర్ల ద్వారా తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. కన్మనూర్ కేంద్రానికి ఆర్టీవో శాఖ ద్వారా ప్రత్యేకంగా ఒక లారీని ఏర్పాటు చేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు వేగంగా తరలించేలా చర్యలు చేపట్టారు. అలాగే మండలం లో అన్ని కొనుగోలు కేంద్రాలకు అదనపు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ధాన్యం రావణ వేగవంతం చేయాలని అడ్డాకుల ఎపియం ను ఆదేశించారు. మండలంలో రవాణా వాహనాల కొరతను అధిగమించేందుకు మహబూబ్‌నగర్ నుంచి ఏడు లారీలు, అడ్డాకుల చెక్‌పోస్ట్ నుంచి ఐదు లారీలను సమీకరించి సమీప కొనుగోలు కేంద్రాలకు పంపించారు. గన్నీ సంచుల కొరతను నివారించేందుకు వేముల, నందిపేట్, కొమిరెడ్డిపల్లి, భూత్పూర్, మద్దిగట్ల, కరివేన, జనంపేట్, పొన్కల్, బాలీద్‌పల్లి కేంద్రాలకు తలా ఐదు వేల గన్నీ సంచులను సరఫరా చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 45 వేల గన్నీ సంచులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట జిల్లా ఎస్పీ డా.వినీత్

నారాయణపేట, మే 17 ప్రభాతవార్త : అవగాహన, జాగ్రత్తలతోనే సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలమని ఆయన తెలిపారు ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్‌సైట్లు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు వంటి కొత్త తరహా సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా.వినీత్ సూచించారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు,స్టాక్‌మార్కెట్ పేరుతో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా యువత అపరిచితుల మాటలు నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయడం వల్ల మొబైల్ ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అప్రమత్తతే ఇలాంటి మోసాల నుంచి రక్షణ కల్పించే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన వెంటనే గోల్డెన్ అవర్‌లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లలో నేరగాళ్లు తమ సొంత వెబ్‌సైట్లలో పెట్టుబడులపై అధిక లాభాలు వచ్చినట్లు చూపించి, డబ్బు ఉపసంహరించుకునే సమయంలో అందుబాటులో లేకుండా మోసం చేస్తున్నారని వివరించారు. జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

జిల్లా ఎస్పీ డా.వినీత్

ట్రాక్టర్లు, జెసిబిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

అక్రమంగా నల్ల మట్టి తరలింపు

ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

దామరగిద్ద, మే 17 ప్రభాతవార్త : దామరగిద్ద మండలం మొగలమడక గ్రామ శివారులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నల్ల మట్టి / ఒండ్రు మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని దామరగిద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు తమ వాహనాలతో మట్టిని తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వాహనాలను అదుపులోకి తీసుకొని చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పట్టుబడిన వాహనాల వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాక్టర్ నం.టిఎస్06 ఎఫ్‌సి 6379 ట్రాక్టర్ నం. టిజి 38 0051 - ట్రాలీ నం. ఎపి22 వై 0125 ట్రాక్టర్ నం. టిఎస్ 38 టి 2560 - ట్రాలీ నం. టిఎస్ 38 టి 2561, ట్రాక్టర్ నం. టిఎస్06 ఇఎస్ 8284 ట్రాక్టర్ నం. టిఎస్34 టి 4315 - ట్రాలీ నం. టిఎస్ 34 టి 4316 ట్రాక్టర్ నం. టిఎస్06 ఎఫ్ 6337 ట్రాక్టర్ నం. టిజి 38 ఎ 1486 - ట్రాలీ నం. టిఎస్ 06 ఇఎల్ 8442 మెస్సీ ఫర్గుసన్ 246 మోడల్ ట్రాక్టర్ (నంబర్ లేదు) జేసీబీ నం. టిజి38 ఎ 7479 వాహనాల యజమానులు, డ్రైవర్ల పేర్లు వరుసగా అశోక్, ప్యాట గుండప్ప, ఉషాప్ప, అంతరం పెద్ద మల్లప్ప, సామలబండ హన్మంతు, కుర్వ శ్రీను, కుర్వ శేఖర్, మొగులబై వెంకటేష్, వి.రాములుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

పిడుగుపాటుకు 30 గొర్రెల మృతి..

- గొర్రెల కాపరికి త్రుటిలో తప్పిన ప్రమాదం
- గొర్రెల కాపరిని పరామర్శించిన మంత్రి జూపల్లి
- రూ.50 వేల తక్షణ సాయం అందించిన మంత్రి
- మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం పరిశీలన..
- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ధాన్యం కొనుగోళ్లపై సీఎం నిరంతరం పర్యవేక్షిస్తున్నారు
- ఎన్ని ఇబ్బందులు వచ్చిన రైతులు పండించిన చివరి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది: మంత్రి జూపల్లి

గొర్రెలు మృతి చెందిన ప్రదేశాన్ని గొర్రెల కాపరిని సందర్శించిన మంత్రి జూపల్లి

కొల్లాపూర్,మే17, ప్రభాతవార్త : కొల్లాపూర్ మండలం ఎనబెట్ల గ్రామ శివారులో శనివారం పిడుగుపాటుకు 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే

తడిసిన ధాన్యాని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

స్పందించి, బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఆయనను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తక్షణ సహాయం కింద రూ.50 వేల నగదును అందజేశారు. తడిసిన ధాన్యం పరిశీలన.. అనంతరం మంత్రి జూపల్లి కొల్లాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్న రాశులను ఆయన నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని సైతం గోదాములకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడించారు.రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.సీఎం నిరంతరం పర్యవేక్షణ..రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కొనుగోళ్ల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడి ఊహించిన దానికంటే భారీగా పెరగడంతో గోదాములు సరిపోవడం లేదని చెప్పారు.ఈ సమస్యను అధిగమించడానికి కాటన్ గోదాములు, ప్రైవేట్ గోదాములతో పాటు అవసరమైన చోట ఫంక్షన్ హాళ్లను సైతం -మిగతా2లో..

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

వనపర్తి ప్రతినిధి, మే 17, ప్రభాతవార్త : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగించాలని, అదేవిధంగా గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ వరి కొనుగోళ్ల ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగించాలని, అదేవిధంగా గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైనన్ని లారీలను అందుబాటులో ఉంచి, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత అవసరాల మేరకు నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలకు అదనపు లారీ లను పంపాలని ఆదేశించారు. మిల్లుల వద్ద అన్లోడింగ్ కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. కొనుగోలు విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలనీ,

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పోలీస్ అధికారుల సమన్వయంతో అన్లోడింగ్ చేయించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్దేశిత లక్ష్యం ప్రకారం వరి ధాన్యం కొనుగోళ్ల జరగాలని ఆదేశించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని వేగంగా తూకం వేసి కేటాయించిన మిల్లులకు తరలించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, జిల్లా మేనేజర్ ఆంజనేయులు, ఇతర అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ తనిఖీ

ధన్వాడ, మే 17 ప్రభాతవార్త : బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌కోట చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను ఎస్ఐ రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వాహనాల పత్రాలు, పశువుల రవాణాకు సంబంధించిన అనుమతులను తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు.ఎస్ఐ రాములు మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమరవాణాను అరికట్టేందుకు -మిగతా2లో..

తనిఖీ చేస్తున్న ఎస్సై రాములు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించిన దృశ్యం

శ్రీరంగాపూర్, మే 17 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా విజయోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మోజెస్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాల పెంపు కోసం తల్లిదండ్రులు ప్రజలు సహకరించాలని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిలేటి, మాజీ జడ్పిటిసి రాజేందర్ ప్రసాద్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి శ్రీహరి రాజు మాట్లాడుతూ కళాశాల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందిస్తామని మండలంలోని అన్ని గ్రామాల నుంచి అడ్మిషన్లు పొందే విధంగా చూస్తామని తెలిపారు. కార్యక్రమం అనంతరం 2025,26 లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానం చేయడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మోజెస్, అధ్యాపకుల బృందం, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ సర్పంచ్ మద్దిలేటి, మాజీ జడ్పిటిసి రాజీవ్ ప్రసాద్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి శ్రీహరి రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

ప్రతి సంవత్సరం పాడి పశువుల మృత్యువాత

పాడి పశువులకు, గ్రామస్తులకు పొంచి ఉన్న ప్రమాదం

మృత్యువాత పడ్డ గొర్రెపొటేలు

దేవరకద్ర, మే 17 ప్రభాతవార్త: కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర తేలి ఉన్న కరెంటు తీగలకు తగిలి గొర్రె పొట్టేలు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రతి సంవత్సరం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. సరైన నిర్వహణ లేకపోవడం వల్ల ఈ ప్రమాదం జరుగుతున్నట్లు గ్రామ సర్పంచ్, స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది 12 గొర్రెలు తేలి ఉన్న కరెంట్ తీగకు తగిలి పడి ఉంటే అక్కడున్న పశువుల కాపరి తొందరగా వెళ్లి కరెంట్ తీగలను కర్రలతో కొట్టి ప్రమాదం నుంచి కాపాడాడు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర తేలి ఉన్న కరెంట్ తీగలకు, మరమ్మతులు చేయాలని గ్రామంలో ఎలాంటి అపరిష్కృత సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులు నష్టపోతుంటే

కాంగ్రెస్ ప్రభుత్వం కాలక్షేపం చేస్తుంది

బిఆర్ఎస్ నాయకుడు గంజి కృష్ణ

మిడ్జిల్, మే 17 ప్రభాతవార్త : జడ్చర్ల నియోజకవర్గంలో అకాల వర్షాలతో మార్కెట్ యార్డ్‌లో మొక్కజొన్న ధాన్యం తడిసి రైతులు కన్నీరు పెడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రచార హంగులతో కాలక్షేపం చేస్తుందని బిఆర్ఎస్ నాయకుడు గంజి కృష్ణ మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలై రైతులు నిస్సహాయస్థితిలో రోదిస్తుంటే మాది రైతు ప్రభుత్వం అంటూ ప్రెస్ మీట్ లు పెట్టుకోవడం తప్ప రైతులకు ఉపయోగపడే చర్యలు తీసుకోవడం లేదని తీవ్ర ఆందోళన ఆవేదన వ్యక్తం చేశారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే తడిసిపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఎలాంటి షరతులు లేకుండా పరిహారం అందించాలన్నారు. లేదంటే జడ్చర్ల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్వాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలపై గంజి కృష్ణ ఘాటుగా స్పందించారు. మాజీ మంత్రివర్యులు లక్ష్మారెడ్డిని విమర్శించే స్థాయి నీకు ఎక్కడిదని వారు మండిపడ్డారు. రైతులను ఆదుకోమని అంటే చౌకబారు విమర్శలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని వారు ఘాటుగా స్పందించారు. రైతులను ఆదుకోవడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా రైతులకు న్యాయం చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్దూరు ఎస్‌హెచ్‌వోగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై బిజ్జా శ్రీనివాసులు

ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు శ్రీనివాసులు

మద్దూరు, మే 17 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై బిజ్జా శ్రీనివాసులు శనివారం మద్దూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు మద్దూరు ఎస్సైగా పనిచేసిన విజయ్ కుమార్ జిల్లా వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయనస్థానంలో బిజ్జాశ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌హెచ్‌వో బిజ్జా శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్‌ను అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలసహకారంతో మద్దూరు మండలంలో శాంతియుత వాతావరణం కొనసాగించేలా కృషి చేస్తామని ఎస్సై బిజ్జా శ్రీనివాసులు తెలిపారు.

రెండు సిమెంట్ బెంచ్‌ల బహుకరణ

సిమెంట్ బెంచీలు బహుకరిస్తున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు

కల్వకుర్తి, మే 17 ప్రభాతవార్త: కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద గ్రామంలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ రెస్టె బెంచ్‌స్ కార్యక్రమంలో భాగంగా గ్రామ బస్ స్టాప్ ఆవరణలో ప్రజల సౌకర్యార్థం 2 సిమెంట్ బెంచీలు చేశారు. ప్రతి రోజూ బస్ కోసం వేచి ఉండే ప్రయాణికులు, వృద్ధులు, మహిళలు గ్రామ ప్రజలు కూర్చొనేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్య క్షుడు కుకుడాల శ్రీకాంత్ నేత మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించే దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మిత్ర ఫౌండేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ దామోదర్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు, మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికలు

దామరగిద్ద, మే 17 ప్రభాతవార్త : దామరగిద్ద మండలంలోని లోకుర్తి, అన్నాసాగర్ గ్రామాలకు చెందిన 50 మంది యువకులు, గ్రామస్తులు మాజీ సర్పంచ్ రాములు ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ పార్టీలో చేరారు. వీరందరికీ తెలంగాణ రక్షణ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కవితక్క ప్రకటించిన పంచజన్యం" ద్వారా తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ, పేదరికం లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అందువల్ల తెలంగాణ రక్షణ సేన పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ పార్టీ జిల్లా యువత అధ్యక్షులు మనోజ్ కుమార్ గౌడ్, ఆశన్‌పల్లి నారాయణ రెడ్డి, జనార్దన్, విట్లపూర్ బీమాషప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే జీఎంఆర్

తాగునీటి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన బోరు నుంచి నీటిని మళ్లిస్తున్న తండావాసులు

భూత్పూర్, మే 17, ప్రభాతవార్త : భూత్పూర్ మండలం హస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పోతుగుట్టతండా ప్రజలు గత కొన్నేళ్లుగా సతమతమయ్యే తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)చొరవతో ఆదివారం చెక్ పడింది. తండావాసులు తాగునీటి కోసం పలు ఇబ్బంధులెదుర్కొంటున్న అంశాన్ని తండావాసులు సునీత, రవి తదితరులు సర్పంచి తాళ్లగడ్డ సంజీవరెడ్డి ద్వారా ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే పోతుగుట్టతండాలో తక్షణం తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరగా, స్పందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా తక్షణం రు. మూడున్నర లక్షల నిధుల స్పెషల్ ఫండ్‌తో నూతనంగా నిర్మితమైన వాటర్‌ట్యాంక్‌కు బోరు, పైప్‌లైన్‌ను నూతనంగా ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎంతో కాలంగా తాగునీటి కోసం ఇబ్బంధి పడుతున్న తండావాసుల తాగునీటి సమస్యను పరిష్కారమైందని తండావాసి రవినాయక్ తెలిపారు. తాగునీటి సమస్యను విన్న వెంటనే స్పందించి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరింప జేసిన ఎమ్మెల్యే జీఎంఆర్, ఇందుకనుగుణంగా చర్యలుతీసుకున్న జిల్లాకలెక్టర్ ఖుష్బూ గుప్తాకు పోతుగుట్ట తండావాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తండాలో ఆదివారం నూతనంగా బోరు, పైప్‌లైన్ ఏర్పాటు కార్యక్రమంలో సర్పంచి తాళ్లగడ్డ సంజీవరెడ్డితో పాటు ఉపసర్పంచి సాయి వెంకటరెడ్డి, ఏఈ ఉమెర్, పంచాయతీ సెక్రటరీ అర్చన, తండావాసులు రవినాయక్, సునీత, గంగారామ్ నాయక్, హన్మం తు, రవిమేస్త్రీ, రాములు, ఎంచందర్, పాండు, బాలు, శంకర్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలి

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిఆర్ఎస్ నాయకులు

మదనాపురం, మే 17 ప్రభాతవార్త : అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం చివరిగింజ వరకు కొనుగోలు చేయాలని మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్‌లో కురిసిన వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బిఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. తడిచిపోయిన వరి ధాన్యంను పరిశీలించి రైతులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెమటోడ్చి పండించిన ధాన్యం అకాల వర్షంతో తడిసిపోవడం బాధకరమన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనాల్సిన బాధ్యత ఉందన్నారు. గన్నిబ్యాగులు, రవాణా సౌకర్యం ఇవేవీ లేకుండా చూడాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం వేసే క్రమం లో 42కిలోల600గ్రాములకు తూకం వేస్తే రైస్ మిల్లుల్లో ధాన్యం దించే క్రమంలో ఒక లారీ లోడుకు సుమారు ఆరు క్వింటాళ్ల వరకు తక్కువ చూపిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రైతుల కు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా లారీలు, హమాలీల కొరతలేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు, అధికారులు మళ్లీ టార్పిన్లను తెప్పించి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి, మాజీ కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, పట్టణ అధ్యక్షుడు ఆవుల బాలకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోజ్ కుమార్, సింగల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, సర్పంచులు ఆంజనేయులు, శివనాయక్, పల్లవి వెంకటేష్, మాజీ సర్పంచులు కురుమూర్తి, ఆంజనేయులు, శివశంకర్, మండల నాయకులు కరుణాకర్ యాదవ్, రాజ్ కుమార్, దేశి వెంకటేష్, రాములు గౌడ్, వెంకటస్వామి, నాగరాజు, మహేష్, రామచంద్రయ్య, కురుమూర్తి, నరసింహ గౌడ్, ప్రవీణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాస్తారోకో

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో రాస్తారోకో

అమరచింత మే 17, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆదివారం అమరచింత బస్టాండ్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సబ్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు కే రాజన్న మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలను పెంచారని ఎన్నికలలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచమని వాగ్దానం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట చెప్పారని వారు అన్నారు. అలాగే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న వంట గ్యాస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి వంట గ్యాస్ ధరలను పెంచారని వారు అన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో సామాన్యులకు అందుబాటులో ఉండే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని వెంటనే పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయకుండా దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు ప్రజలను కోరారు. రాస్తారోకో వల్ల మరికల్, ఆత్మకూర్, నర్వ, మక్తల్ వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు మసలమని, ప్రేమరత్నం, విజయ్, తాజుద్దీన్, ఆనంద్, రామచందర్, గణేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

బోనస్ డబ్బులు వేస్తారా.. వెయ్యరా..? స్పష్టం చేయాలి

బీజేపీ మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప

మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప

కృష్ణ, మే 17, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లు క్వింటాలుకు రూ. 500 బోనస్ వేయాలని మండల బిజెపి అధ్యక్షులు నల్లె నరసప్ప కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్లు కొనుగోలు కేంద్రాలలో అమ్మి 25 రోజులు అయినా కూడా బోనస్ డబ్బులు తమ అకౌంట్లో పడలేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు.ˇ రైతులకు పెట్టుబడి సాయంగా ఇచ్చే బోనస్ డబ్బులు వేసి వారిని ఆదుకోవాలని కోరారు. సన్న వడ్లకు బోనస్ వేస్తారా లేదా సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు స్పష్టం చేయాలన్నారు. విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడిన వారు కొన్న వడ్ల డబ్బులు మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేసి, బోనస్ డబ్బులు వేయకుండా చేతులు దులుపుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. పెట్టుబడులు ఎక్కువ అవడంతో పాటు, పంటలు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది. వడ్లు అమ్మితే పెట్టుబడి కూడా రాలేదు అని రైతులు దిగులు చెందుతున్నారని అన్నారు. ఒకవేళ ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీకి తెచ్చి పంటలు పండించిన రైతుల పరిస్థితి అధోగతి పాలయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది కావున రైతులను ఆదుకోవడం కోసం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా యాసంగి రైతు భరోసా కేవలం రెండు ఎకరాలకు మాత్రమే వేసి మౌనం పాటించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రైతు భరోసా పంటలు పండే భూములకు మాత్రమే కుటుంబ యూనిట్‌గా ఐదు ఎకరాలకా.. లేక పది ఎకరాలకు ఇస్తారా.. ప్రకటించి ఖరీఫ్, యాసంగిలో సకాలంలో రైతు భరోసా ఇస్తే రైతులకు కొంత ఆసరా అవుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది రైతులను ఆదుకోవడం కోసం వడ్లు అమ్మిన వారికి బోనస్, రైతులందరికీ రైతు భరోసా వేసి రైతుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు జి.శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర, తిమ్మప్ప పాల్గొన్నారు.

పేటలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం విజయవంతం

వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

నారాయణపేట, మే 17 ప్రభాతవార్త : నారాయణపేట మార్కెట్ రోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గం.ల నుంచి మధ్యాహ్నం 3 గం.ల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ గ్రామాల నుంచి 200 మందికి పైగా ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందారు. నారాయణపేటలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట మరియు ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యురాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నెఫ్రాలజీ యురాలజీ (కిడ్నీ వ్యాధులు) వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. లయన్ కె. శివకుమార్ రెడ్డి, లయన్ డా. పర్నికా రెడ్డి ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో, ప్రముఖ యురాలజిస్ట్ డా. విశ్వజిత్ రెడ్డి పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. పరీక్షలు నిర్వహించిన అనంతరం దాదాపు 80 మందికి పైగా రోగులకు తదుపరి చికిత్స అవసరమని గుర్తించిన వైద్యులు, వారిని ఏఐ ఎన్‌యు ఆసుపత్రితో పాటు ఇతర వైద్య కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందుబాటులో ఉంటుందని డా. విశ్వజిత్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లయన్ హరినారాయణ భట్టాడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత భట్టాడ్, డా. విజయ్, కౌన్సిలర్ రాజేష్ ఘూట్, నాయకులు కోట్ల రవీంద్ర రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సలీం, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ తనిఖీ

మొదటి పేజీ తరువాయి భాగం..

పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ద్వారా 24 గంటల పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. అక్రమ రవాణా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద వాహనాలు, అక్రమ రవాణా గురించి సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 30 గొర్రెల మృతి

మొదటి పేజీ తరువాయి భాగం..

తడిసిన ధాన్యాని గోదాములకు తరలిస్తున్న దృశ్యం

వినియోగించుకుని నిల్వ చేస్తున్నామని వివరించారు. ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటోందన్నారు. ఇబ్బందులున్నా అధిక ధరకే కొనుగోలు.. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోలు చేయడం లేదని మంత్రి జూపల్లి విమర్శించారు. దీనివల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి వస్తోందన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు చాలా తక్కువ ధర ఉన్నప్పటికీ, రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. హమాలీల కొరత, ఆర్థిక ఇబ్బందులు, గోదాముల కొరత వంటి సమస్యలు వేధిస్తున్నప్పటికీ.. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన చిన్నారెడ్డి

పెద్దమందడి, మే 17 ప్రభాతవార్త : మండల పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన నందిపేట అంజనమ్మ, నార్ల రమేష్, గట్టు లక్ష్మిలకు ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసినట్లు బాలచంద్రుని రఘు తెలిపారు. చెక్కుల కోసం కృషి చేసిన డా. జిల్లెల చిన్నారెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు సన్మాన కార్యక్రమం

విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

రేవల్లి మే 17 ప్రభాతవార్త: రేవల్లి మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేవల్లిలో 100 ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అధ్యక్షతన విద్యార్థులను అభినందిస్తూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టప్పా రాజయ్య, ఎపిసి చైర్మన్ వెంకటమ్మ, ఎ.ఎం.ఒ మహానంది, సి.ఎం.ఒ ప్రతాప్ రెడ్డి, వార్డెన్ జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి కుటుంబానికి గ్రామానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలి

మాట్లాడుతున్న టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు

అమరచింత మే 17, ప్రభాతవార్త; భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు ప్రభుత్వం తొమ్మిది వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల కు అనేక సంక్షేమ పథకాలు ఉన్న అధికారులు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు కోసం ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల ఆడబిడ్డల పెళ్లిలకు లక్ష రూపాయలు ఇవ్వాలని, అలాగే డెలివరీ దరఖాస్తులకు లక్ష ఇవ్వాలని పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కూడా రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు భారీగా పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు రంగన్న, టియుసిఐ జిల్లా కార్యదర్శి సి రాజు, టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి. గణేష్, మసలమని, రమేష్, చెన్నయ్య, వెంకటేష్, శేఖర్, రవి, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌లో యథేచ్చగా ఒండ్రుమట్టి రవాణా

ఇష్టారీతిగా ఇటుక బట్టీలకు ఒండ్రుమట్టి తరలింపు

మక్తల్‌టౌన్,మే17 ప్రభాతవార్త : మక్తల్ మండలంలోని కర్ని గ్రామంలో ఆదివారం అని లెక్కచేయ కుండా ప్రభుత్వ అనుమతులు లేకుండానే చెరువులో భారీ ఎత్తున మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ అక్రమంగా ఇతర ప్రాంతాల్లోని ఇటుకబట్టీలకు పట్టపగలే తరలిస్తున్నారు. జేసీబీలు,టిప్పర్ల సహాయం తో మట్టిని తరలిస్తుండటాన్ని చూసి గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గత కొన్నిరోజులుగా పదుల సంఖ్య లో టిప్పర్లు మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో మట్టిని ఎలా తరలిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తుంటే, మట్టి మాఫియా సభ్యులు వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. స్థానికనాయకుల అండదండలతోనే ఈఅక్రమాలు కొనసాగుతున్నాయని గ్రామస్థులు విమ ర్శిస్తున్నారు. గత నాలుగు రోజులుగా కర్నే గ్రామ రైతులు తమ పొలాలకు నల్లమట్టి తరలిస్తుండగా, ఆదివారం అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల అండతో ఎలాంటి పర్మిషన్ లేకుండానే చెరువులో నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రహదారిపై వాహనాల రాకపోకల వల్ల గ్రామీణ రోడ్డు మార్గం పూర్తిగా అధ్వానంగా తయారవుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి, అనుమతులు లేకుండా నల్లమట్టి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా నల్లమట్టి తరలించే మాఫియాపై గ్రామాల వారీగా తిరగబడాల్సిన పరిస్థితి వస్తోందని, ఇలా ఇష్టానికి తరలిస్తే రైతులకు పంట పొలాలకు సారావతమైన ఒండ్రును తీసుకెళ్లి ఇటుక బట్టీలకు తరలించడంపై ప్రజలు, స్థానిక నాయకులు ఎలాగైనా ఒండ్రు మట్టి తరలింపును కట్టడి చేసే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్ శ్రీను

నారాయణపేట,మే 17 ప్రభాతవార్త : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను అధికారులను ఆదేశించారు. ఆశన్‌పల్లి, ఖాజీపూర్, దమ్‌గా న్‌పూర్ ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో వరి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రభుత్వ నిబంధనల ప్రకా రం నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వరి సేకరణ చేపట్టాలని ఆయా కేంద్రాల ఇంచార్జ్‌లకు సూచించా రు. సేకరించిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు ఆలస్యం లేకుండా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఓపీఎంఎస్‌లో రోజువారీ ట్యాబ్ ఎంట్రీలను ఎలాంటి జాప్యం లేకుండా నమోదు చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సైదులు, డీటీలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్లోడింగ్ పనులను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

ఖిల్లా గణపురం మే 17, ప్రభాతవార్త; గోదాములు రైస్ మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని అన్లోడింగ్ పనులు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం మం డల పరిధిలోని మానాజీపేట గ్రామంలోని ఖిల్లా ఆగ్రో గోదాం, శ్రీరామ ఇండస్ట్రీస్, లక్ష్మీనరసిం హ రైస్ మిల్స్ సందర్శించి వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడే అవకాశం ఉందని సంబంధిత అధికారులు పట్టించుకోని అన్లో డింగ్ పనులను వేగవంతం చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. లారీలను ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూసుకోవాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమ యానికి వరి ధాన్యం అన్లోడింగ్ పూర్తి చేసి రవాణా వ్యవస్థను సమన్వయంతో నిర్వహించాలని చెప్పారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా వేగవం తం చేసి తూకం తొందరగా చేసే విధంగా తగుచర్యలు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్, స్థానిక తహసిల్దార్ సుగుణ, ఎస్సై వెంకటేష్, ఆర్ఐ తిరుపతయ్య, పలువురు అధికారులు ఉన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

చిన్నారెడ్డిని సన్మానించిన నూతన కార్యనిర్వహణాధికారులు

వనపర్తి,మే17, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా నూతనంగా 190కార్యనిర్వహణాధికారి (ఈఓ)పోస్టులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన సందర్భంగా కేబినెట్ లో ఫైల్ ఆమోదం తెలిపే విషయంలో పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకొని ఫైలు మంత్రి వర్గ ఆమో దం పొందే విధంగా కృషి చేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డిని కార్యనిర్వహణాధికారులు ఆదివారం చిన్నారెడ్డి నివాసంలో ఆయనకు పూల బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రాచీన ఆలయాలకు తగిన నిర్వహణ అధికారులు లేక ఇబ్బంది పడుతున్న సందర్భంలో నూతన పోస్టుల మంజూరీతో పరి పాలన గాడిలో పడేఅవకాశం కలదు. అలాగే వేలకోట్ల ఆస్తులు కాపాడే అవకాశం కలదని అన్నారు. ఈకార్యక్రమంలో ఉద్యోగ సం ఘం రాష్ట్రనాయకులు జనుంపల్లి జయపాల్ రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, యుగంధర్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేం ద్రప్రసాద్ యాదవ్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల ఎన్ఎస్‌యుఐ అధ్య క్షుడు ఎత్తం చరణ్ రాజ్, ఎంట్ల రవి, సోషల్ మీడియా రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడవద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

మదనాపురం, మే 17 ప్రభాతవార్త : అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులు ఎవరు అధైర్యపడ వద్దని ప్రభుత్వం అండగా నిలుస్తుందని తాహసిల్దార్ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని అజ్జకొల్లు ,గోవిందాహల్లి, మదనాపురం గ్రామంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల తో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు. చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని త్వరగా తూకం వేసి పూర్తి చేయాలని కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందికి ఆయన సూచించారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అసత్య ప్రచారం చేస్తున్నాయని వారి మాటలను ఎవరు నమ్మొద్దని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతి అని రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచులు శారద రామకృష్ణ, పోతురాజు రాములు, సాయిబాబా, చుక్క మహేష్, ఆర్ఐ రాజేశ్వరి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

జడ్చర్ల, మే 17, ప్రభాతవార్త : జడ్చర్లలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి మున్సి పాలిటీ పరిధిలోని 26వ వార్డు క్రాంతి నగర్‌లో నివసిస్తున్న బంటు యాదయ్య ఇంటి పై చెట్టు కూలి పడడం వల్ల రేకులు ఇల్లు ధ్వంసం అయింది. కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సూచన మేరకు తుంగ రఘు బాధిత కుటుంబానికి ఐదువేల రూపాయల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో 26వ వార్డు కాంగ్రెస్ నాయకులు అజ్జు, రాము, కాలనీవాసులు శేఖర్, యాదయ్య పాల్గొన్నారు.

17ఎంబిఎన్ఆర్ 28: బాధితునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రానివ్వదు

రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ

చిన్న చింతకుంట, మే 17 ప్రభాతవార్త : కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ అధికారులను ఆదేశించారు. ఆదివారం బండర్ పల్లి లోని కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యానికి సరిపడా లారీలను ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలను తలెత్తకుండా చూడాలని ఆమె సూచించారు. వరి ధాన్యం తూకాల అనంతరం రైస్ మిల్లర్లకు పంపించాలని అక్కడ రైతులకు రైస్ మిల్లర్లు ఎలాం టి సమస్యలు రాకుండా చూడాలని ఆమె తెలిపారు. దమగ్నా పూర్ లోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల స్థలాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట తహసిల్దార్ ఎల్లన్న తదితరులు ఉన్నారు.

ఎంసెట్‌లో సత్తా చాటిన రావుస్ విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన కళాశాల యాజమాన్యం

వనపర్తి, మే 17, ప్రభాతవార్త: ఆదివారం ప్రకటించిన తెలంగాణ ఎంసెట్ 2026 ఫలితాలలో వనపర్తి రావుస్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. 1) బి. భద్ర శ్రీనివాస్ ర్యాంక్ 2460, మార్క్స్ 78.54 2) ఆర్. మాధవి ర్యాంక్ 14613, మార్క్స్ 61.60 3) సుప్రజ ర్యాంక్ 18628, మార్క్స్ 56.09 4) బి.సంతోష్ నాయుడు ర్యాంక్ 25180, మార్క్స్ 53.51 5) ఆబ్ నాన్ ర్యాంకు 28 416, మార్క్స్ 52.55 ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శ్రీరామ్ కుమార్ ఏ.శ్రీనివాస్, కె. శ్రీనివాస్, అమరేందర్, బి.రమేష్ రెడ్డి అభినందించారు.

భూత్పూర్ వద్ద రెండు ఆటోలు ఢీ : పలువురికి గాయాలు

భూత్పూర్,మే 17,ప్రభాతవార్త : భూత్పూర్ మున్సిపల్‌పరిధిలోని శేర్పల్లి(బి) వద్ద జాతీయ రహదారి-44పై రెండు ఆటోలు పరస్పరం ఢీకొనడంతో ఆటో ప్రయాణీకులు పలువురికి గాయాలయ్యా యి. వివరాల్లోకి వెళితే వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న ఆటోను వెనకవైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటో తన ముందు వెళ్తున్న మరో ఆటోను ఢీకొట్టి బోల్తా పడ్డాయి. ఆటోల్లో ప్రయాణిస్తున్న ఎనిమిది ప్రయాణీకులు గాయపడ్డారు. ఓ ఆటోలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు పెద్దలు, నలుగురు పిల్లలు మొత్తం ఎనిమిది మంది ప్రయాణీకులు గాయపడినట్లు ఇక్కడిస్థానికులు చెబుతున్నారు. వీరిలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు లక్ష్మి(40), లావణ్య(45)లతో పాటు మరోబాలుడు విజయ్‌కుమార్(11)లు జిల్లా ప్రధానాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అన్నాసాగర్ పోలీసులు ప్రమాద కారణాలను దర్యాప్తు జరుపుతున్నారు.

వర్షాకాలంలో మళ్లీ ముప్పు తప్పేలా లేదా

కల్వర్టుల నిర్మాణాలు చేపట్టరా..?

నవాబుపేట,మే 17 ప్రభాతవార్త : వర్షాకాలం సమీపిస్తుండటంతో వర్షం వచ్చిందంటే చాలు కల్వర్టులు దెబ్బతిని రాకపోకలు ఎక్కడ నిలిచిపోతాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కూచూరు దొడ్డిపల్లి చిన్న చెరువు గతేడాది అలుగు వెళ్లిన సందర్భం ఊహించుకొని రాబోయే వర్షాకా లంలో కూడా భారీ వర్షాలు కురిస్తే ఎలా అని భయాందోళనకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా నవాబుపేట మండల పరిధి లోని కూచూరు 2.కిష్టారం దొడ్డిపల్లి గ్రామాల మధ్య గల చిన్న చెరువు వెనుక గల కల్వర్టు దగ్గర, 3.దొడ్డిపల్లి గ్రామం సమీపం లో, 4.రుద్రారం గ్రామంలో, రుద్రారం కూచూర్ గ్రామాల మధ్య గల రాజమోని వంపు దగ్గర, 5.కూచూర్ దగ్గర గల ఆకులోని కుంట దగ్గ6.మల్లారెడ్డిపల్లి గ్రామం నుండి చెన్నారెడ్డిపల్లి మధ్య,7. చెన్నారెడ్డిపల్లి గ్రామం దగ్గర లెంకల చెరువు అలుగు, 8.చెన్నారెడ్డి పల్లి రుక్కంపల్లి గ్రామాల మధ్య కల్వర్టులు9.కారూరు గ్రామం నుండి ఇప్పటూరు గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు దగ్గర, 10. కారూర్ గ్రామం ఆంజనేయస్వామి దేవాలయం ముందు రోడ్డుపై చెరువు అలుగునీరు, ఇలా మండల వ్యాప్తంగా కల్వర్టులు నిర్మించాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే భయం గుప్పిట్లో చుట్టుపక్కల గ్రామాల కల్వర్టులు ఎప్పుడు నిర్మిస్తారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూచూర్, దొడ్డిపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దాదాపు పది గ్రామాల ప్రజలు అటు జడ్చర్లకు ఇటు నవాబుపేటకు మధ్యలో గల గ్రామాల యువకులు పోలేపల్లి కంపెనీలలో ఉపాధి పొందుతూ రైతులు వారు పండించిన పంటలు కూరగాయలు ఎగుమతి చేయడానికి రోజు కొన్ని వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. గత

గతేడాది వర్షాకాలంలో వచ్చిన వరదలు, ఇబ్బంది పడ్డ ప్రజలు (ఫైల్)

ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు అలుగుపారి రోడ్డు కల్వర్టు మొత్తం ధ్వంసం అయి రాకపోకలకు వారం రోజులపాటు ఆటంకం కలిగింది. ఆ వరద ఉధృతిలో ముగ్గురు పట్టు తప్పి వరద ఉధృతిలో కొట్టుకుపోయి చనిపోయిన రోజులు కూడా ఉన్నాయి. భారీ వర్షాల వరద ఉధృతికి రోడ్లు మొత్తం పూర్తిగా కొట్టుకు పోయాయి. అయితే అవి నేటికి కూడా అధికారులు గానీ నాయకులు గానీ చెరువు అలుగు కల్వర్టు కోసం ప్రతిపాదనలు అందించడం లేదని అధికారులు గ్రహించడం లేదని అటువైపు చూడటం లేదని పాపోతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నా కల్వర్టుల నిర్మాణానికి నోచుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్తే త్వరితగతిన ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చొరవ చూపుతాడని వెంటనే సమస్యలు కల్వర్టులు పరిష్కారం అవుతాయని ప్రజలు నాయకుల మాటల్లో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్ష ఏదైనా జాగృతి నెంబర్ వన్...

మరోసారి సత్తా చాటిన జాగృతి కళాశాల విద్యార్థులు

వనపర్తి,మే 17, ప్రభాతవార్త: ఆదివారం విడుదలైన టిజి ఎప్‌సెట్ 2026 ఫలితాలలో మా జాగృతి కళాశాల విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో సిహెచ్. అర్జున్ 4445 ర్యాంక్, రాహుల్ 4972 ర్యాంకులు సాధించి వనపర్తి జిల్లాలో సరికొత్త రికార్డును సృష్టించి జిల్లా నెం.1గా నిలిచారు. అదే విధంగా మీనా 13363, అగ్రికల్చర్ విభాగంలో కె. శిల్ప 10564, వి. అర్చన 14698, వంటి అత్యుత్తమ స్టేట్ ర్యాంకులు సాధించారు. 5 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇద్దరు, 15 వేల లోపు ర్యాంకులు ఐదుగురు, 30 వేల లోపు ర్యాంకులు 15 మంది విద్యార్థులు, ర్యాంకులు సాధించడం జరిగింది. టిజి ఎప్‌సెట్‌లో 123 మంది కోచింగ్ తీసుకోగా 96 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో అర్హత సాధించి వనపర్తి జిల్లాలో సరికొత్త రికార్డును సృష్టించడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులను సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డా. అంబటి వినోద్ కుమార్, యజమాన్య సభ్యులు శ్యామ్ కుమార్ సత్యనారాయణ, భాస్కర్, అధ్యాపక, అధ్యా పకేతర బృందం, బొకే, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డా. అంబటి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్ విద్య అంటే కేవలం ఐపిఇ మార్కు లే కాదు జెఈఈ, నీట్, ఎప్‌సెట్ అని చెప్పారు. మా కళాశాల విద్యార్థులు ఎటువంటి లాంగ్ టర్మ్ కోచింగ్ లేకుండా రెగ్యులర్ ఇంటర్ విద్యతో పాటు జెఈఈ, నీట్, ఎప్‌సెట్ బ్యాచులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్పొరేట్

ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల యజమాన్యం

విద్యాసంస్థలకు దీటుగా సాధారణ విద్యార్థులతో రాష్ట్ర, జాతీయ స్థాయి ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడిజిల్లాలో సంచలనాలు సృష్టిస్తున్న ఏకైక కళాశాల జాగృతి కళాశాల అదే విధంగా ఐపిఇ పాస్ పర్సెంటేజ్‌లో కూడా నంబర్ 1 స్థాయిలో ఉంది అని తెలియచేయుటకు ఎంతో సంతోషిస్తున్నాం. తల్లిదండ్రులకు తెలియజేయడం ఏమనగా తక్కువ మంది విద్యార్థులతో కార్పొరేట్ ప్రణాళికా, మెటీరియల్ తో 26 సంవత్సరాల అనుభవం గల కార్పొరేట్ స్థాయి అధ్యాపకులతో జెఈఈ, నీట్, ఎప్‌సెట్ బ్యాచులను సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుంది. దీనికి నిదర్శనమే పై ఫలితాలు అని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో యజమాన్య సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివారం ఆన్ డ్యూటీ..!

జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ గా ఎం.గిరీష్ బాధ్యతలు

సంతకం పెట్టి నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటన

కూలిన ఇండ్లు, డ్రైనేజీ వ్యవస్థ పరిశీలన

జడ్చర్ల, మే 17, ప్రభాతవార్త : జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌గా ఎం గిరీష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న లక్ష్మారెడ్డి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా శనివా రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం జడ్చర్ల మున్సిపాలిటీ నూతన కమిషనర్ ఎం.గిరీష్ బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన మరుక్షణమే అధికారులు, మున్సిపల్ సిబ్బందితో జడ్చర్ల మున్సిపాలిటీ

నూతన కమిషనర్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

కూలిన ఇండ్లను పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.గిరీష్

స్థితిగతులపై సమీక్షించారు. తదనంతరం ఇటీవల భారీవర్షానికి కూలిన ఇండ్లను పరిశీలించారు. మట్టి ఇండ్లలో ఉన్న వారిని, నిరాశ్రయులను పునరావాస కేంద్రం ఎస్సీ కమ్యూనిటీ హాల్ లోకి వెళ్లాలని సూచించారు. అదేవిధంగా జడ్చర్ల పట్టణంలో నేతాజీ చౌరస్తాలో శానిటేషన్ డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించారు. తదుపరి మేనేజర్ లక్ష్మన్న, ఆఫీస్ వివిధ సెక్షన్ల అధి కారులకు, సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి సలహాలు సూచన లు అందజేశారు. ప్రతి ఒక్కరూ కృషిచేసి మునిసిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. విధుల్లో చేరిన తొలిరోజే పట్టణంలో పర్యటించి పలు సమస్యలపై సూచనలు సలహాలు అందిస్తూ పరిష్కారానికి కృషి చేయడం విశేషం.

గంగా హారతి..

గంగాహారతిలో పాల్గొన్న ఎంపి డికె అరుణ

మహబూబ్‌నగర్, మే 17 ప్రభాతవార్త : ఉత్తరాఖండ్ రాష్ట్రం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రిషికేశ్‌లో త్రివేణి ఘాట్ వద్ద గంగా నది తీరంలో నిర్వహించిన గంగాహారతిలో ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. దీపాల వెలుగులు, వేద మంత్రోచ్చారణల మధ్య గంగా మాతకు ప్రత్యేకహారతి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు.

ఉత్సాహంగా హ్యాపీ సండే

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆకట్టుకున్న మ్యాజిక్ షో, కరాటే విన్యాసాలు

చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు

మహబూబ్‌నగర్ టౌన్, మే 17 ప్రభాతవార్త : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆదివారం ఉదయం మహబూబ్ నగర్ స్టేడియం కమాన్ – ప్రధాన రోడ్డు కూడలి వద్ద మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హ్యాపీ సండే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులచేత సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు, డాన్స్ ప్రదర్శనలు, మ్యాజిక్ షో, యోగాసనాలు, మిమిక్రీ షో ప్రేక్షకులను అలరించాయి. సీనియర్ సిటిజన్ల డాన్స్ ప్రదర్శనలు, అలాగే విద్యార్థుల కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు స్టాళ్లు ఏర్పాటుచేసి వారు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలు, ఇతర వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డి విరిస్తున్న కేంద్రం

పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్

జడ్చర్లలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

జడ్చర్ల, మే 17,ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని కాంగ్రెస్ శ్రేణులు విమర్శించారు. జడ్చర్లలోని సిగ్నల్ గడ్డ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. దీంతోపాటు నిత్యావసర ధరలు కూడా మరింత పెరగడంతో సామాన్యులు జీవనం గడపడం ఇబ్బందిగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్ యాదవ్, బుక్క వెంకటేష్, యాదయ్య, రవిశంకర్, మాలిక్ షాకీర్, అనుప కృష్ణయ్య, ఎర్ర ఆనంద్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, మీనాజ్, సర్వరాజ్, మాజీ కౌన్సిలర్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు సన్మానం

మహబూబ్‌నగర్, మే 17, ప్రభాతవార్త : సమతాక్షర జ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 10వ డివిజన్, పాతపాలమూర్ లోని 10 వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా వన్ టౌన్ సిఐ అప్పయ్య, బెక్కెం జనార్ధన్ పాతపాలమూర్ (ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, 10వ డివిజన్ కార్పొరేటర్ టీ.రమేష్ బాబు ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించి సన్మానించారు. విద్యార్థులను మెమెంటో, శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా కార్యక్రమ నిర్వాహ కులను అభినందించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు బి. హరిదాస్, ఉపాధ్యాక్షుడు కే.అశోక్, ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, సహాయ కార్యదర్శి ఆంజనేయులు, సంజీవ రాజు, పి.యాదయ్య, పి.ఆంజనేయులు, జగదీశ్, బాల క్రిష్ణ, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ ఉండేలా కృషి

ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ

భాగస్వాములు కావాలి ఎన్టీఆర్

కళాశాల విద్యా వారోత్సవాల ముగింపు

కార్యక్రమంలో నగర మేయర్ మమత

మహబూబ్‌నగర్, మే 17 ప్రభాతవార్త : మహబూబ్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉండేలా విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నారని, ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల్ మమతా శ్రీనివాస్ కోరారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ జి.మమత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తుందని నేడు దేశానికి రోల్ మోడల్ గా మారిందన్నారు. విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి రంగంలోనూ మహబూబ్‌నగర్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండే విధంగా కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అందులో భాగంగా విద్యార్థులైన మీరంతా మీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు కష్టపడి విజయం సాధించాలన్నారు. అలాగే ఇంచార్జ్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహన్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విద్యా వారోత్సవాల పేరుతో నిర్వహించిన ఏడు రోజుల కార్యక్రమాలు వాటి అభివృద్ధిపై జరిగిన సమీక్షను వివరించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కల్పనకై డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టడం ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయంటున్నారు. అనంతరం రాష్ట్ర,

మాట్లాడుతున్న మేయర్ మమత

జాతీయస్థాయి క్రీడలలో విజయాలు సాధించిన విద్యార్థిని క్రీడాకారులకు సన్మానం, అలాగే దేశ్ పాండే ఫౌండేషన్ ద్వారా వివిధ రకాల కంపెనీలలో ప్లేస్మెంట్స్ సాధించిన విద్యార్థినులను కూడా సన్మానించారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం, కూచిపూడి, చేసిన విద్యార్థినులైన మీనాక్షి, స్నేహ నృత్య ప్రదర్శన, మహిళా సాధికారత పై ఎన్‌సిసి విద్యార్థినిలు నిర్వహించిన నాటక ప్రదర్శన, తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొ॥ ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కన్వీనర్ డా.ఎం. ప్రవీణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. పద్మ అనురాధ, ఐక్యూఏసి, కోఆర్డినేటర్ డా.జె. శ్రీదేవి, డా. హరిబాబు, డా. లక్ష్మి నరసింహారావు, మద్దిలేటి, డా. మార్కండేయ, స్వరూప పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE-CUM CHIEF JUDICIAL MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT:: AT: KUSHAIGUDA.
O.S. NO. 238 OF 2026

Between:
Sri B. Chandra Sekhar and 3 others ... Plaintiffs
AND
1. The Tahsildhar, Uppal Mandal, Medchal-Malkajgiri District, Telangana State – 500039.
2. The Tahsildhar, Telkapally Mandal, Nagarkurnool District, Telangana State – 509385.
3. All Concerned ... Defendants
To,
All Concerned
Sir/Madam,
Whereas the above named Plaintiffs have filed the above suit seeking the declaration as legal heirs of late b. Bharatamma alias B. Bharathamma who died on 12-11-2025. Thereafter, all concerned are hereby requested to appear before the Hon'ble court at 10:30 A.M. on 12-06-2026 either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise the matter will be heard and decided exparte in your absence.

SUIT SCHEDULE "B" PROPERTY
All that agricultural lands admeasuring Ac.00-21 gts in Survey No.90/A, Ac.01-33 gts in Survey No.91/A & Ac.01-19 gts in Survey No.96, total admeasuring Acs.3-33 gts, situated at Gaddampally Village and Gram Panchyath, Telkapally Mandal, Nagarkurnool District, Telangana State and bounded by:
NORTH : SOUTH :
EAST : WEST :

SUIT SCHEDULE "C" PROPERTY
All that agricultural lands admeasuring Ac.00-21 gts in Survey No.90/AA, Ac.01-33 gts in Survey No.91/AA & Ac.01-19 gts in Survey No.96, total admeasuring Acs.3-33 gts, situated at Gaddampally Village and Gram Panchyath, Telkapally Mandal, Nagarkurnool District, Telangana State and bounded by:
NORTH : SOUTH :
EAST : WEST :

(By order of the Court)
S. VENKATESHWARLU,
K. HANMANDLU,
K. BHARATH KUMAR, Advocates,
Off: 2-3-512/B/111, 2nd Floor, Chenna Reddy Nagar, Amberpet, Hyderabad – 500013. Ph: 9849369366

అభిషేకాలకు తరలి వచ్చిన భక్తులు. (ఇన్‌సెట్)డిసిఎం సతీమణిని సత్కరిస్తున్న దృశ్యం

ఎన్కతల ఆలయంలో భారీగా తైలాభిషేకాలు

మోమిన్‌పేట్, మే 17. ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో గల శనైశ్వర స్వామి కి భక్తులు పెద్ద సఖ్యంలో తైలాభిషేకాలు నిర్వహించారు. శని జయంతిని పురస్కరించుకుని ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 2100 మంది అభిషేకాలు నిర్వహించగా... భక్తులకు ఏ విధమైన ఇబ్బంది రాకుండా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉపముఖ్యమంత్రి సతీమణి నందిని బట్టి కుటుంబ సభ్యులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు సౌకర్యాలు కల్పించిన ఆలయ కమిటి నిర్వాహకులను అభినందించారు. ఈ ఆలయంలో పార్కింగ్ సౌకర్యం, అన్నదానం ఏర్పాటు చేసిన వెంకటగిరి పీఠం, సిరిపురం అఖిల భారత అయ్యప్ప స్వామి సేవా ట్రస్టు లను, మంచినీటి సౌకర్యం, పారిశుధ్య సేవలు అందించిన పంచాయతి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను అభినందించారు. పూజలు అనంతరం ఆమెను ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, ఆలయ కార్య నిర్వాహకులు పాల్గొన్నారు.

ఫర్వీన్‌కు చెక్కు అందిస్తున్న జిల్లా అధికారులు

టెన్త్ జిల్లా టాపర్‌కి పదివేలు ప్రోత్సాహకం

దోమ, మే 17, ప్రభాతవార్త: టెన్త్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఫర్వీన్‌ను జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాదికారి రేణుక అభినందించారు. 600కు 575 మార్కులు సాధించిన ఫర్వీన్ కృషి తోటి విద్యార్థులకు స్పూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆదివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమములో భాగంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ అభినందన సభ జరిగింది. ఫర్వీన్‌ను సన్మానించి పదివేలు రూపాయల చెక్కు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమములో దోమ మండల విద్యాధికారి వెంకట్, కిష్టాపూర్ పాఠశాల ప్రదానోపాధ్యాయులు లాల్య పాల్గొని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

నేపాలీ దొంగకు స్థానికుల దేహశుద్ధి

ఘట్‌కేసర్ రూరల్, మే 17, ప్రభాతవార్త: పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యంనంపేట్‌లో తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగతానానికి యత్నించిన నేపాలీకి చెందిన ఒకరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. యంనంపేట్‌లోని సాయి తేజ కాలనీలో రాత్రి దాదాపు 11 గంటల సమయంలో నేపాల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తాళం వేసి ఉన్న ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి యత్నించారు. గమనించిన స్థానికులు వెంబడించటంతో అక్కడి నుంచి పరార వటానికి ప్రయత్నించారు. వారిలో ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మరొక నిందితుడు తప్పించుకుని పారిపోయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

వెంకటేశ్వర స్వామి దేవాయలం నూతన కమిటీ సభ్యులు

శ్రీవారి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

కేశంపేట మే 17 ప్రభాతవార్త : కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నూతన అభివృద్ధి కమిటీని గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ చైర్మన్‌గా చిల్వేరు చంద్రయ్య, వైస్ చైర్మన్‌గా గుత్తి రంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కసాబ్ రాజేందర్, సహాయ కార్యదర్శిగా మద్దెల శేఖర్, కోశాధికారిగా ఎర్రమోని చెన్నయ్యను ఎన్నుకున్నారు. దేవాలయ కార్యవర్గ సభ్యులుగా మల్తుంకార్ గోపాల్, సూరమోని సత్య నారాయణ, పల్లాటి కృష్ణయ్య, చిల్వేరు మల్లయ్య, చెదురువెల్లి సుదర్శన్ గౌడ్, వడ్ల జంగాచారి, చాకలి జంగయ్యను ఎన్నుకున్నారు. అనంతరం దేవాలయ కార్యవర్గ సభ్యులకు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సఫూరా ఆమేర్, మాజీ వైస్ ఎంపీపీ సురేందర్, మాజీ సర్పంచ్ జంగయ్య, వార్డు సభ్యులు నాగరాజు నాయకులు దిద్దెల జంగయ్య, నారాయణరెడ్డి, ఎర్ర నరసింహ, తోట వెంకటేష్, ముత్యాలు, పద్మోజీ, గోపాల్ రెడ్డి, మాలె నరసింహ, లింగయ్య, శ్రీను, బాలాజీ, మల్లేష్, కమ్మరి కృష్ణయ్య, అంజయ్య, శ్రీశైలం, నారాయణ, లక్ష్మి ్మ నారాయణ, అవ్వారీ శ్రీను, రాము, లింగం, అంజి, రాజు, సాయి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థిని అమీనాబేగంను సన్మానిస్తున్న అధికారులు

మెరిట్ విద్యార్థులు మరింతగా రాణించాలి

కేశంపేట, మే 17, ప్రభాతవార్త : కేశంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 581 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థిని అమీనా బేగంను అధికారులు సత్కరించారు. ఆదివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలలోని విద్యా విజయోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ అమీనా బేగం భవిష్యత్తులో ఇంకా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎమ్ చంద్రశేఖర్, కేశంపేట గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్, ప్రధాన ఉపాధ్యాయురాలు విద్యావతి దేవి ఉపాధ్యాయులు గోవర్ధన చారి శంకర్, నరేందర్ రెడ్డి,సిఆర్పి రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అకుంఠిత శ్రమే ప్రగతి మార్గానికి సోపానం

కొత్తూరు, మే 17, ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల చివరి రోజు ఆదివారం పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కొత్తూరు పాఠశాలలో విద్యా విజయోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా, క్రీడా రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. అంగూర్ నాయక్ అభినందించి సత్కరించారు. విద్యా రంగంలో ప్రతిభ కనబరిచిన టి. వివేక్, అభిషేక్, ప్రవళిక, ఆకాష్, తెలుగు మాధ్యమ విద్యార్థులు కావలి నందిని, అనూష, శ్రీలతలను ప్రత్యేకంగా అభినందించారు. చౌక్ బాల్ క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించిన శ్రీలక్ష్మి ్మ, అర్చిత, వాలీబాల్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన కార్తీక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె. అంకూర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి విజయాలను అందుకోగలడని పేర్కొన్నారు. విద్యార్థులు సరైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రగతి మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రవికుమార్, భగవంతుడు, రాజు, పీడీ నవనీత, సిహెచ్ సుజాత, శిరీష, పద్మజతో పాటు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కల్వకుర్తికి మణిహారంగా ఫోర్త్ సిటీ

◆ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను ప్రజలకు చేరవేయాలి
◆టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు, మే17, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమర్ధవంతమైన పార దర్శక పాలనతో స్వల్పకాలంలోనే అన్ని వర్గాల ప్రజలకు చేరువైందని టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ ట్రిబ్యునల్ చైర్మన్ పదవి కట్టబెట్టడం అందుకు నిదర్శన మన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫోర్త్ సిటీ నిర్మాణంతో దక్షిణ తెలంగాణతోపాటు యావత్తు రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా కల్వకుర్తి నియోజకవర్గంకు నాలుగో నగరం మణిహారంలా మారనున్నదన్నారు.

అభినందన సభను విజయవంతం చేయండి

తెలంగాణ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమితులైన

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్

అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు తెలంగాణ వ్యాప్తంగా ప్రతి గడపకు చేరుకుంటున్నాయని, మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, గృహజ్యోతితో 200 యూనిట్ల కరంటుతోపాటు వ్యవసాయరంగ పథకాలను ఆయన ఉదహరించారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్ళ పథకం నిరుపేదల సొంతింటి కల సాకారం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ శ్రేణుల ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పార్టీలకతీతంగా అర్హులైన వారికే దరి చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను ప్రజలకు మరింత చేరువయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి పదవులు కట్టబెడుతూ తగిన గుర్తింపు ఇస్తుందని ఆయన వివరించారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి సేవలందించిన సూదిని రాంరెడ్డిని తెలంగాణ సూదిని రాంరెడ్డికి మే 20న అభినందన సభ ఏర్పాటు చేసినట్లు టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ఉదయం 11గంటలకు అభినందన సభలో ప్రత్యేకంగా సన్మానిస్తున్నట్లు ఆయన వివరించారు.

కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల గ్రామ పంచాయతీ సర్పంచులు, పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సభ నిర్వహణపై పలు అంశాలను పార్టీ శ్రేణులతో కలిసి చర్చించారు.

ఈకార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, సీనియర్ నాయకులు భట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, సుద్దపల్లి వెంకటేశ్వర్లుగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య, వస్పుల శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, సర్పంచులు నరేందర్‌రెడ్డి, బిక్యానాయక్, కోఆప్షన్ మెంబర్ ఖాదర్, కృష్ణనాయక్, కాలె మల్లయ్య, ఫరీద్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

30న ఆలూరుకు మందకృష్ణ రాక

చేవెళ్ల, మే 17, ప్రభాతవార్త : ఈనెల 30న ఆలూరులో మహనీయుల విగ్రహావిష్కరణను పురస్కరించుకుని చేవెళ్ల ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో అంబేద్కర్ యువజన సంఘం నేతలు మహనీయుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ రానున్నారనని తెలిపారు. గౌరవ అతిథులుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్, మాజీ ఎమ్మెల్యే కేస్ రత్నం, ప్రముఖ రచయిత గోరేటి వెంకన్న తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. మండల పరిధిలోని అన్ని సంఘాల వారు, వివిధ గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బ్యాతల శివశంకర్ మాదిగ, చేవెళ్ల మాజీ ఉప గంగి యాదయ్య, సిపిఐ రామస్వామి, ఎమ్మార్పీఎస్ ఆలూరు గ్రామ అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు మహేందర్,అనంత రాములు,పేష్కరి రాజు, రమేష్, సునీల్, తలారి రాజు మోకారం రాజు కుమార్, మైసయ్య, రాజు, బిక్షపతి, బెన్నీ, ప్రశాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులు ప్రదానం

ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని యామిని ఎస్ఎస్‌సీలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించడంతో జిల్లా కలెక్టర్ మను చౌదరి సత్కరించారు. కలెక్టరేట్‌లో విద్యావా రోత్సవాలలో భాగంగా ప్రతిభా అవార్డు ప్రదానం జరిగింది. ఈసందర్భంగా ఎంఇఓ, ప్రధానో పాధ్యా యులను అభినందించి టాపర్‌గా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. ఘట్‌కేసర్ బాలాజీనగర్‌కు చెందిన యామిని పదవతరగతిలో 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా రాగా జిల్లాలో ద్వితీయ స్థానం పొందింది. ఈసందర్భంగా యామినిని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సన్మానించి రూ.10 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

యామినికి నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

జాతీయ పతాకాన్ని ఎగురవేసిన దృశ్యం

జాతి ఐక్యతకు పాటుపడదాం

శంకర్‌పల్లి, మే 17, ప్రభాతవార్త : జాతి ఐక్యతకు పాటుపడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సేవాదళ్ డిస్టిక్ ప్రెసిడెంట్ రమకాంతరావు అన్నారు. శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం యువత ప్రజలు ఏక తాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్ హరిత కృష్ణారెడ్డికి శంకర్ పల్లి మండల సేవాదళ్ ప్రెసిడెంట్ మహమ్మద్ నసిరుద్దీన్ జాతీయ జెండాను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జనార్ద న్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ రవీందర్ రెడ్డి, సత్యనారాయణ. శంకర్ పల్లి మండల సేవాదళ్ ఉప అధ్యక్షులు రాఘవేందర్ మరియు పెంట రెడ్డి చెందిప్ప గ్రామం సేవాదళ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్రో ధరలు తగ్గించాలని రాస్తారోకో

జవహర్ నగర్, మే17, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం కీసర సర్కిల్ నాయకులు బంగారు నర్సింగరావు డిమాండ్ చేశారు. ఆదివారం బాలాజీ నగర్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలపై భారాలు మోపే విధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అమాంతం పెంచడం అన్యాయమన్నారు. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా చార్జీలు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వై. మల్లేష్, సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతకింది అశోక్, సీపీఎం జవహర్ నగర్ డివిజన్ నాయకులు శివన్నారాయణ, కార్మిక సంఘాల నాయకులు డి.నగేష్, చంద్రశేఖర్, కుమార్, నాగరాజు, సూరి, సాయి, రాజు, ఆంజనేయులు, లక్ష్మణ్, బాలరాజు, నరసింహ, లింగమ్మ, పద్మ, స్వామి, రాములు, ఎస్‌కే రంజాన్, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

షాబాద్, మే 17, ప్రభాతవార్త : చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అన్నారు. పీఎంశ్రీటీజీఎంఎస్ షాబాద్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బీపీసీ విద్యార్థిని పి. పూజ 982 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో బీపీసీ గ్రూపులో అత్యుత్తమ ప్రతిభకనబరిచి జిల్లా టాపర్గా నిలవడంతో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి సుశీందర్రావులు విద్యార్థినికి రూ.10 వేల నగదుతో పాటు ప్రశంసా పత్రంను అందజేశారు. ఇక్కడితో ఆగిపోకుండా ఉన్నత చదువుల్లో కూడా ఇదే ప్రతిభను చాటాలన్నారు. విద్యార్థిగా చూపించిన క్రమశిక్షణ, పట్టుదల జిల్లాలోనే టాప్ స్థానంలో నిలబెట్టిందన్నారు. వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్న కళాశాల సిబ్బంది, అధ్యాపకులకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి సుశీందర్

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జిల్లేడు చౌదరి గూడ, మే 17, ప్రభాతవార్త: జిల్లెడ్ చౌదరి గూడ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బిఆర్ఎస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. మండలంలోని ఇంద్రనగర్ గ్రామానికి చెందిన మోరంబాయి శ్రీనుకు రూ. 27వేలు, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బంగారు రాములమ్మకు రూ.24,500, వనంపల్లి గ్రామానికి చెందిన కావాలి సునీతకు రూ 15వేలు, సభవత్ శ్రీనుకు రూ.27వేలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.

లిక్కర్ రాణి వాస్తవాలు తెలుసుకోవాలి..

తలకొండపల్లి, మే 17, ప్రభాతవార్త : మాజీ మంత్రి టీ.హరీష్ రావుపై కల్వకుంట్ల కవిత చేసిన విమర్శలు మానుకోవాలని బిఆర్ఎస్ మండల నాయకులు విజయకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని జులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవిత మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నారన్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీళ్ల రాలేదని విమర్శించటం అర్ధరహితమన్నారు. భూగర్భ జలాలు పెరగటంతో రైతులు రెండు నుండి మూడు పంటలు పండించుకోగలుతున్నారని పేర్కొన్నారు. లిక్కర్ దందాలో మునిగి తేలిన లిక్కర్ రాణికి క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలియవని.. రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చిన తండ్రిని లెక్కచేయని కవితకు తెలంగాణా ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

చెక్కు అందజేస్తున్న సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి

పేదలకు సిఎంఆర్ఎఫ్ వరం

తలకొండపల్లి, మే 17, ప్రభాతవార్త: నిరుపేదలకు సిఎంఆర్ఎఫ్ (సిఎం రిలీఫండ్)చెక్కులు వరం లాంటిదని లింగారావు పల్లి సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగారావు పల్లి గ్రామానికి చెందిన వల్లింపుల యాదయ్య అనారోగ్యానికి గురై కార్పొరేటు ఆసు పత్రిలో డబ్బులు ఖర్చు చేశారు. పేదవాడు కావటంతో ఖర్చులు భరించకపోయారు. దీంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో ఆసుపత్రి ఖర్చులు సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేశారు. ఆదివారం మంజూరు ఐన చెక్కును యాదయ్యకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి, బాల్ రెడ్డి, అంజిరెడ్డి, భాస్కరరెడ్డి, యల మందరెడ్డి, ప్రతాపరెడ్డిలు ఉన్నారు.

ఎప్ సెట్‌లో షాద్‌నగర్ విద్యార్థుల సత్తా

షాద్‌నగర్, మే 17, ప్రభాతర్త : తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ 2026 ఫలితాలలో బైపిసి స్ట్రీమ్‌లో షాద్ నగర్ విశ్వభారతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఫలితాలలో ఈ కళాశాల విద్యార్థి ఎం. సుశాంక్ రెడ్డి రాష్ట్రస్థాయిలో 710 వ ర్యాంకులు సాధించి కళాశాల కీర్తిని పెంచాడు. అదేవిధంగా మరో నలుగురు విద్యార్థులు గౌరవ సింగ్ 5789, టి.సోనీ 9709, జునైరా మెహ్వష్ 9935, ఎం. అక్షి త 10259 ర్యాంకులను సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శివకుమార్ తో పాటు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

మహా ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు

ప్రతి కార్యకర్త అంకితభావంతో పోరాడాలి

షాద్‌నగర్, మే 17, ప్రభాతవార్త : గిరిజన హక్కుల సాధన కోసం ప్రతి గిరిజన నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పోరాడాల్సిన అవసరం ఉందని ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అన్నారు. ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా ధర్నాకు సంబంధించిన హైదరాబాద్ మహాధర్నా పేరిట కరపత్రాలను ఆదివారం పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మహాధర్నాను విజయవంతం చేయాలని నేతలను, కార్యకర్తలను, గిరిజన ప్రజలను కోరారు. తాలూకా అధ్యక్షుడు పాతావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన న్యాయ కార్యదర్శి చందర్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఉమ్లా నాయక్, కార్యదర్శి మోహన్, యువజన అధ్యక్షుడు సంజు నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు అయోధ్య శ్రీనివాస్, ఆరు మండలాల అధ్యక్షులు రాము నాయక్, బాబు నాయక్, సంతోష్ నాయక్, రాజు నాయక్, గోపాల్ నాయక్, రామ్ చరణ్ నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆదర్శం అభినందనీయం

మేడ్చల్, మే 17. ప్రభాతవార్త : యాదవులు నిజాయితీకి మారుపేరు అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన యాదవ సంఘం భవనాన్ని ఆదివారం సంఘం అధ్యక్షులు తోకల లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు నీతి, నిజాయితీగా ఉంటారని, నమ్మిన వారికి ఎల్లవేళలా అండగా నిలుస్తారని తెలిపారు. తాను గతంలో యాదవ సంఘం భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించగా సద్వినియోగం చేసుకుని భవనాన్ని నిర్మించుకోవడం సంతోషకరమని అన్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో యాదవ భవనం కోసం అడిగిన వెంటనే ఎమ్మెల్యే మల్లారెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ భాస్కం యాదవ్, ఎల్లంపేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, గ్రామ మాజీ సర్పంచ్ బాబుయాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు నవీన్‌రెడ్డి, కౌన్సిలర్ నిశిత, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్ యాదవ్, సుదర్శన్, బాలు, రఘుపతిరెడ్డి, హరత్‌రెడ్డి, గ్రామ నాయకులు పోచయ్య, సత్తిరెడ్డి, కోల్ల వెంకటేశ్, క్రిష్ణ, సోమేశ్ యాదవ్, హన్మంత్‌రెడ్డి, శశికుమార్, శ్రీకాంత్, యాదవ సంఘం సభ్యులు శ్రీశైలం యాదవ్, సాయికుమార్, వేణుయాదవ్, వెంకటేశ్, సుదర్శన్, క్రిష్ణ, మహేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూడూర్‌లో యాదవ సంఘం భవనం ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి

క్రీడా ప్రాంగణాన్ని కాపాడండి

అందజేశారు. పూడూర్ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేను కలిసి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 608లో గల స్థలంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని స్థలాన్ని ఇతరులకు ఇవ్వకుండా క్రీడలకు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌యాదవ్, ప్రవీణ్, ప్రశాంత్, నిఖిల్, పరమేశ్, శ్రీనివాస్, శివ, సాయి, ప్రతాప్, మధు, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.